# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# కేంద్రానికిది తగునా?

**దక్షిణాది** రాష్ట్రాల్లో ఆదాయం ఎక్కువ జనాభా తక్కువ, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆదాయం తక్కువ జనాభా ఎక్కువ. పన్నుల రూపంలో దక్షిణాదిలో వసూలు చేసే సొమ్మును కేంద్రం ఎక్కువగా ఖర్చుపెట్టేది ఉత్తరాదిలోనే. ఇది వ్యవస్థాగతమైన సమస్య. మరోరకం సమస్య కూడా ఉన్నది. అది, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీజేపీయేతర రాష్ట్రాల్లోని ఇతర ప్రభుత్వాల పట్ల నిధుల విషయంలో చూపుతున్న వివక్ష. ఈ విషయమై కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. తాజాగా ఈ సమస్య శ్రుతిమించి పాకాన పడుతున్నది. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించడమే ఇందుకు తార్కాణం. ఇలాంటి కేసులు వేసిన అన్ని రాష్ట్రాలు దక్షిణాదివే కావడం గమనార్హం. సాధారణ నిధులే కాదు, ప్రకృతి బీభత్సాల సందర్భంగా రాష్ట్రాలకు అందజేయాల్సిన సహాయం విషయంలోనూ కేంద్రం వివక్ష చూపుతున్నదని తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాయి. ఇకపోతే తమ ఆర్థికవ్యవస్థ విధ్వంసానికి కేంద్రం కారణమవుతున్నదని కేరళ ప్రభుత్వం కేసు వేయడం బీజేపీ సర్కార్ తీరుతెన్నులను తెలియజేస్తున్నది. తెలంగాణపై కూడా కేంద్రం చూపిన వివక్ష ఎంతటిదో తెలిసిందే. కేంద్రంపై తెలంగాణ ప్రథమ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్రస్థాయిలోనే యుద్ధం చేశారు. కానీ, కేంద్ర ప్రభుత్వం తన ధోరణిని ఏ మాత్రం మార్చుకోలేదు. ఇప్పుడు మిగతా దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి కూడా అంతే దారుణంగా తయారైంది. కాకపోతే, ప్రస్తుత తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు మాత్రం కేంద్రంపై నోరు మెదిపేందుకు సంకోచిస్తున్నది. దీనివెనుక ఉన్న పరమార్థం ఏమిటో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకే తెలియాలి.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ధోరణి వల్ల భారతదేశ సమాఖ్య వ్యవస్థ తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నది. రాజ్యాంగకర్తలు కేంద్రీకృత ప్రభుత్వ వ్యవస్థకు బదులుగా సమాఖ్య వ్యవస్థ వైపే మొగ్గుచూపారు. భిన్న భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, భోజన విహారాలు కలగలిసిన మన దేశంలో సమాఖ్యవాదం నెలకొంటేనే మంచిదని వారి అభిప్రాయం. ప్రాంతీయ ఆకాంక్షల వ్యక్తీకరణ, పరిపూర్తికి సమాఖ్యవాదమే ఉత్తమ మార్గం అని వారి నమ్మకం. అధికారాలు, ఆర్థిక నిర్వహణ విషయంలో కేంద్రం 'సమానుల్లో ప్రథమ స్థానం' అన్నట్టుగా ఉంటుంది. సామరస్య ధోరణితో వెళ్లినంతవరకు పెద్దగా సమస్య ఉండదు. కానీ, కేంద్రం తనకున్న విచక్షణాధికారాన్ని ఏకపక్షంగా రాజకీయ దృష్టి కోణంతో విపక్ష పాలిత రాష్ట్రాలను అణచివేసేందుకు ఉపయోగిస్తే సమస్య ఎదురవుతుంది. అందుకే కేంద్రం చూపుతున్న వివక్షాపూరిత ధోరణి నుంచి తమను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టుకు మొర పెట్టుకుంటున్నాయి. నిధుల విషయంలో కేంద్రం తమపై సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నదని, ప్రకృతి బీభత్సాలు సంభవించినా ఆదుకోవడం లేదని కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఫిర్యాదు చేస్తున్నాయి.

ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేయడం గమనార్హం. రాష్ట్రాలకు కేంద్రం పోటీదారు కాదని తేల్చిచెప్పడం వివక్షాపూరిత విధానాలను ఎత్తిచూపడమే. ఒకరకంగా సమాఖ్యవాదానికి తలవంపులు తెచ్చే వ్యవహారమే. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను తన రాజకీయ అవసరాలకనుగుణంగా వాడుకుంటున్నదని ఆరోపణలు మొదటి నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పుడు రాష్ట్రాలకు నిధుల విషయంలో తన విచక్షణాధికారాన్ని కూడా రాజకీయ అవసరాలకే వాడుకుంటున్నదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇది దేశ సమాఖ్య వ్యవస్థ ఆరోగ్యానికి ఏమంత మంచిది కాదు. ఇప్పటికైనా కేంద్రం తన బాధ్యతలను గుర్తెరిగి, రాష్ట్రాలకు న్యాయంగా ఇవ్వాల్సిన నిధుల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలి. అప్పుడే దేశం, ముఖ్యంగా సమాఖ్యవాదం మూడు పువ్వులు, ఆరు కాయలుగా పరిఢవిల్లుతుంది.

# కాలం తెచ్చిన కరువు కానే కాదు

తెలంగాణకు మళ్లీ కరువొచ్చింది. రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ వర్షాలకు కరువొచ్చింది. చెరువులకు కరువొచ్చింది. భూగర్భానికి కరువొచ్చింది. పంటచేలకు కరువొచ్చింది. రైతుబంధుకు కరువొచ్చింది. కల్లాల మీద పంటకు కరువొచ్చింది. నీళ్లు రాక.. పడావు పడ్డ భూములతో తెలంగాణ గొంతు తడారిపోతున్నది. తెలంగాణ వాకిట్లో కరువు కరాళ నృత్యం చేస్తున్నది. దాదాపు 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. సగటున 11.4 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. 500 ఫీట్ల లోతు వరకు బోర్లు వేసినా నీరే కానరావడం లేదు.



కోవెల సంతోష్‌కుమార్
90521 16463

తెలంగాణలోని అన్ని జిల్లాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉన్నది. ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి రైతన్నలు నానా కష్టాలు పడుతున్నారు. ఇక నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద పంటలు పండించే రైతుల దుస్థితి వర్ణనాతీతం. ఈ ప్రాంత రైతులకు సాగర్ జలాలే ప్రధాన నీటివనరు. సాగర్ ఆయకట్టు కింద చాలా ప్రాంతాల్లో రైతులు యాసంగి పంట సాగు చేయకపోవడం అక్కడి దుస్థితికి అద్దం పడుతున్నది.

ఆశ్చర్యమేస్తున్నది.. విస్మయం కలుగుతున్నది. కేవలం నాలుగు మాసాల్లో ఒక వ్యవస్థ ఇంతలా అతలాకుతలమవుతుందా? ఉన్నట్టుండి ఈ అనావృష్టికి కారణం ఏమిటి? గత పదేండ్లలో లేని కరువు ఇప్పుడెలా వచ్చింది? 'గత పదేండ్లు వర్షాలు నిరంతరం పడ్డాయి కాబట్టి.. చెరువులు నిండాయి. అందుకే కరువు రాలేదు. కానీ, గత సీజన్‌లో వర్షపాతం తక్కువగా నమోదైంది అందుకే కరువు వచ్చింది' అని ప్రభుత్వం చెప్తున్నది. కానీ, గత సీజన్‌లో అంటే జూన్ 1 నుంచి ఇప్పటివరకు తెలంగాణలో నమోదైన వర్షపాతం 920.9 మిల్లీ మీటర్లు. తెలంగాణ సాధారణ వర్షపాతం 879.4 మిల్లీ మీటర్లు. అంటే సాధారణం కంటే గత సీజన్‌లో 5 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో సాధారణం (785.7 మి.మీ) కంటే ఒక శాతం ఎక్కువ (793.6 మి.మీ) వర్షపాతం నమోదైంది. ఇవి వాతావరణ శాఖ చెప్తున్న లెక్కలు.

వానాకాలం సీజన్‌లో నైరుతి రుతుపవనాల వల్ల సాధారణ వర్షపాతం నమోదవగా.. ఈశాన్య రుతుపవనాల వల్ల వర్షపాతం పెద్దగా నమోదవలేదు. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలు మినహా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు బాగానే పడ్డాయి. మరి చెరువులు ఎందుకు నిండలేదు? నీళ్లు ఎందుకు రాలేదు. గత పదేండ్లలో సాధారణం కంటే ఎక్కువే వర్షపాతం నమోదవుతూ వచ్చింది. ప్రస్తుత సీజన్‌లోనూ వర్షపాతం మైనస్‌లోకి పడిపోలేదు. అయినా కరువొచ్చింది. విచిత్రమేమంటే గత రెండు దశాబ్దాలలో అంటే 2004 నుంచి తెలంగాణలో నమోదైన సగటు వర్షపాతాన్ని కనుక మనం గమనిస్తే.. ఏటా 614-1100 మి.మీ. వర్షపాతం నమోదవుతూ వస్తున్నది. ఇది దాదాపు సగటు వర్షపాతమే. మరి 2004- 2014 వరకు తెలంగాణ ఎందుకు కరువుతో అల్లాడిపోయింది? తెలంగాణ సిద్ధించాక ఎందుకు పంట ఉత్పత్తి పెరగటం ప్రారంభమైంది? 2014లో స్వరాష్ట్రం సిద్ధించిన ప్పుడు 68 లక్షల టన్నులుగా ఉన్న పంటల ఉత్పత్తి ఒక్కసారిగా దాదాపు 3 కోట్ల టన్నులకు ఎలా పెరిగింది? అదే ఆశ్చర్యం. కాలం కలిసొచ్చినప్పుడు మోడువారిన చెట్టు కూడా తిరిగి ప్రాణం పోసుకుంటుందంటారు. 2014లో తెలంగాణ కాలం మొదలైంది. ఇవాళ మళ్లీ కాలం వెనక్కి పోయిందా? అని అనిపిస్తున్నది. ప్రాణం పోసుకున్న తెలంగాణ తిరిగి మోడువారుతున్నదేమో అన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.



సోషల్ మీడియాలో, టీవీ చర్చల్లో తెలంగాణపై సానుభూతి ముసుగేసుకుని మేధావులమని చెప్పుకొనే కొందరు తెలంగాణ నీటి వనరులపై అద్భుతమైన పరిజ్ఞానం ఉన్నట్టు మాట్లాడుతుంటారు. ఇటీవల ఓ పత్రికలో ఒక వ్యక్తి వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో.. 'అమ్మో! అంతంత పెద్ద భారీ మోటర్లు పెట్టి నీళ్లను ఎత్తిపోస్తారా? ఎంత ఖర్చు? మీకు అంత ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. మీకు ప్రాజెక్టులు అవసరం లేదు. మెట్టపంటలు వేసుకొని ఏదో బలుసాకు తిని బతకండి' అన్నట్టుగా అందులో రాశారు. పైగా ప్రాజెక్టులు మొదలు పెట్టిననాడే ఈ కూత కూశానని, తన కూత ఎవరికీ వినిపించలేదని కూడా వక్కాణించారు. మరో పెద్దాయన మల్లనసాగర్ రిజర్వాయర్‌ను టేబుల్ టాప్ రిజర్వాయర్ అని ఎద్దేవా చేశారు. ఎన్ని చెప్పినా వాళ్లు మారరు. కొత్త కొత్త ఈకలు పీకుతుంటారు తప్ప.. వాళ్లు చెప్పదలచుకున్న దాని గురించి అంగుళం కూడా వెనక్కి తగ్గరు. తెలంగాణ భౌగోళిక స్వరూపం, ఇక్కడి నీటిపారుదల వ్యవస్థ గురించి పూర్తిగా అవగాహన ఉన్నవారెవరూ ఇలా అడ్డగోలుగా వ్యాఖ్యానాలు చేయరు.

కరువు ముంగిట తెలంగాణ నిలుచున్న ప్రస్తుత తరుణంలో కాళేశ్వరం ప్రస్తావన తీసుకురాక తప్పడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి సమగ్రంగా, సమర్థంగా ప్రజలకు అవగాహన కల్పించడంలో బీఆర్ఎస్ నాయకులు విఫలమయ్యారనే చెప్పాలి. కాళేశ్వరం ప్రయోజనాల కంటే.. కేసీఆర్‌పై తీవ్రమైన ద్వేషంతో ప్రతిపక్షాలు, కొందరు కుహనా మేధావులు చేసిన దుష్ప్రచారమే ఎక్కువగా ప్రజల్లోకి వెళ్లింది. గతంలో వైఎస్ఆర్ హయాంలో రూపొందించిన ప్రాణహిత-చేవెళ్లకు కాళేశ్వరానికి మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటనే విషయం గురించి ఎవరైనా ఆలోచించారా? కాళేశ్వరం ప్రాజెక్టు కొద్దిగా కిందకు వెళ్లి తుమ్మిడిహట్టికి బదులు మేడిగడ్డ దగ్గర ప్రారంభమైంది. ఒకటి రెండు రిజర్వాయర్లు కొత్తగా వచ్చిచేరాయి. మిగతావన్నీ పాత డిజైన్‌లో భాగమే. తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు కడితే గ్రావిటీ ద్వారా నీళ్లు ఎల్లంపల్లికి వస్తాయన్నది కాంగ్రెస్ వాదన. మేడిగడ్డ దగ్గర కడితే ఎత్తిపోసినా ఎక్కువ నీళ్లు తీసుకోవచ్చన్నది కేంద్ర జల సంఘం ఇచ్చిన సూచన. సరే ఈ రాజకీయ ఆరోపణలు చాలాకాలంగా కొనసాగుతున్నవే. రాజకీయ నాయకులు ఎలాంటి ఆరోపణలైనా చేసుకుంటారు. మనకు తెలంగాణ ప్రజల ప్రయోజనాలు మాత్రమే ముఖ్యం. కాళేశ్వరం ప్రాజెక్టు స్వరూపం చాలామందికి అర్థం కాలేదు. బాహుబలి మోటర్లు, నీళ్లు ఎత్తిపోయడం, ఎక్కువ ఖర్చు కావడం.. అందరూ ఈ లెక్కలు బాగానే చెప్తున్నారు. కానీ, కాళేశ్వరం అన్నది కష్టకాలానికి అన్న మాట ఎవరికీ పట్టడం లేదు. తెలంగాణలో గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం మాత్రమే చేసి వదిలిపెట్టలేదు. దానికి అనుసంధానంగా మిషన్ కాకతీయ కింద 47 వేల చెరువులను పునరుద్ధరించింది. కాళేశ్వరం, చెరువులను బాగుచేయడం అన్నది పరస్పర ఆధారితాలు అన్న విషయం ఎవరికీ అర్థం కావడం లేదు, కాదు కూడా. గత జూలైలో మేడిగడ్డకు ప్రాణహిత నుంచి లక్ష క్యూసెక్కుల వరద వచ్చింది. ఈ నీటిని ఒడిసి పట్టేందుకు మేడిగడ్డ చాలా కీలకం. తుమ్మిడిహట్టి వద్ద ఇంత వరద ఉండదు, రాదు కూడా. పైన గోదావరి నుంచి కూడా చుక్క నీరు రాదు. నిజమే బాహుబలి మోటర్లు, భారీగా విద్యుత్తు ఖర్చు అవుతుందని రాజకీయ ఇంజినీర్లు, కేసీఆర్ విద్వేషకులు పదేపదే చెప్తున్నారు. నిజానికి కాళేశ్వరం నుంచి 180 టీఎంసీల నీటిని ఎన్ని రోజులు ఎత్తిపోస్తారో ఎవరికైనా కనీస సోయి ఉందా? సంవత్సరం మొత్తంలో 90 రోజులు. జూలై- ఆగస్టు మాసాల్లో కొన్ని రోజులు. డిసెంబర్- జనవరి మాసాల్లో మరి కొన్ని రోజులు. మిగతా 275 రోజులు కాళేశ్వరం మోటర్లతో పెద్దగా పని ఉండదు. అంటే కరెంటు ఖర్చు కాదు. గత ఐదు సీజన్లలో ఏడాదికి పది మాసాల పాటు నీళ్లు ఎందుకు అందుబాటులో ఉన్నాయి. భూగర్భ జలాలు ఎందుకు అడుగంటి పోలేదు? ఎందుకంటే.. కాళేశ్వరంలో ఎత్తిపోసిన నీళ్లు 15 రిజర్వాయర్ల ద్వారా దాదాపు 13 జిల్లాల్లోని చెరువులకు చేరాయి. దీనివల్ల వానొచ్చినా, రాకపోయినా ఎలాంటి సమస్య ఉండదు. చెరువుల్లో నీళ్లను రైతులు తమ అవసరాలకు తగ్గట్టు వాడుకొంటారు. ఇంతకాలం చేసింది ఇదే. గత ప్రభుత్వాధినేతల సొంత నియోజకవర్గాల కోసమే మల్లన్నసాగర్‌ను నిర్మించారని కొందరు విష ప్రచారం చేస్తున్నారు. అసలు విషయం ఏమిటంటే.. తెలంగాణకు మల్లన్నసాగర్ అనేది గరిమనాభి లాంటిది. తెలంగాణ మొత్తం ఒక గుడిసె పైకప్పులాగా ఉంటే.. అందులో శిఖరంపైన మల్లన్నసాగర్ ఉంటుంది. సముద్రమట్టానికి దాదాపు 618 మీటర్ల ఎత్తున ఈ ప్రాంతం ఉంటుంది. తెలంగాణలో ఇదే హైయెస్ట్ పీక్. అక్కడికి నీరు తీసుకొని పోగలిగితే.. దాని నుంచి తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు (హైదరాబాద్ సహా) నీటిని గ్రావిటీ ద్వారా సులభంగా చేర్చవచ్చు. అందుకే అక్కడ 50 టీఎంసీల కెపాసిటీతో రిజర్వాయర్ నిర్మించారు. 2022లో ఇదే మల్లన్నసాగర్ నుంచి ఎత్తిపోయకుండానే సింగూరుకు, నిజాంసాగర్‌కు, మంజీరాకు నీళ్లు చేరాయి. ఎస్సారెస్పీకి ఐదు కిలోమీటర్ల దూరం వరకు నీళ్లు వెళ్లాయి. వరదకాల్వ ఒక రిజర్వాయర్‌గా మారింది. చివరి ఆయకట్టు అయిన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ దాకా నీళ్లు వెళ్లాయి.

> ఇంత భారీ ప్రాజెక్టులో ఏదైనా లోపం జరిగితే జరిగి ఉండవచ్చు. లోపాలను సరిచేసుకోవాలి. అంతే కానీ ప్రాజెక్టును పడావు పెడతామంటే ఎలా? పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల కూడా గ్రావిటీ, ఎత్తిపోతల సమ్మిశ్రమమే. అది కూడా దాదాపు పూర్తయింది. అక్కడక్కడా చిన్న చిన్న కాల్వల వంటి పనులు పూర్తి చేస్తే దక్షిణ తెలంగాణ సస్యశ్యామలమవుతుంది.

నాడు నాగార్జునసాగర్ ప్రాజెక్టును ముందుగా ప్రతిపాదించిన ప్రాంతంలో కాకుండా దిగువన నిర్మించి తెలంగాణను ఎండబెట్టారు. ఫలితంగా కృష్ణా, గుంటూరు జిల్లాలు సుసంపన్నమయ్యాయి. అక్కడి రైతులు మన ప్రాంతానికొచ్చి నాయకులయ్యారు.. పాలకులయ్యారు. ఇప్పుడు నీళ్లు అధికంగా ఉండే చోట కట్టిన డ్యాంను ధ్వంసం చేసి.. మళ్లీ నీళ్లు రాని చోట డ్యాంను కడతామంటే ఎలా? వ్యక్తి మీద ద్వేషంతో తెలంగాణను ఆగం చేస్తామంటే ఎలా? తెలంగాణ నుంచి శాశ్వతంగా కరువును తరిమికొట్టేందుకు లక్షించినవి కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులు. వీటిని సద్వినియోగం చేసుకుంటేనే తెలంగాణ సమాజం బాగుపడుతుంది. అలా కాకుండా తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లనుకుంటే మాత్రం.. జరిగేది తెలంగాణ ప్రాజెక్టుల ధ్వంస రచన, తెలంగాణ ప్రజల హింస రచన.

# మూడోసారీ కాంగ్రెస్ కనుమరుగే!




బుద్దా మురళి
98499 98087

> రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరు అధికారంలోకి వస్తారనే ప్రశ్న కంటే బీజేపీకి ఎన్ని సీట్లు వస్తాయనే చర్చే ఎక్కువగా సాగుతున్నది. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో ఏమేం చేయాలనుకుంటున్నారో కూడా ప్రధాని నరేంద్ర మోదీ ముందుగానే చెప్పేస్తున్నారు. తద్వారా విపక్షాలపై యుద్ధం ప్రకటించి, మానసికంగా విజయం సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. 'ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే మీకు పెద్ద పని పెట్టబోతున్నాను. సిద్ధంగా ఉండండి' అని బ్యాంకర్ల సమావేశంలో ప్రధాని ప్రకటించారు. ఇలాంటి ప్రకటనలు ప్రత్యర్థుల మీద తీవ్రంగానే ప్రభావం చూపిస్తాయి. యుద్ధరంగానికి వెళ్లకముందే, యుద్ధం ప్రారంభం కాకముందే ఈ తరహా ప్రకటనలతో ప్రత్యర్థి మీద సగం విజయం సాధించినట్టే అవుతుంది.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ పదేండ్ల పాలన అంత అద్భుతంగా ఉందా? మూడోసారి విజయం సాధించేంత అద్భుతంగా పాలించారా? ప్రభుత్వంపై వ్యతిరేకత అసలే లేదా? అంటే అలా ఏమీ లేదు. ఈ పదేండ్లలో ఇది సాధించాం అని చెప్పుకోవడానికి బీజేపీ సాధించిన గొప్ప విజయాలేమీ లేవు. అయితే హిందుత్వ, మెజారిటీ వర్గం, దేశ భక్తి, జాతీయ వాదం వంటి అంశాలను బీజేపీ బాగా వాడుకొంటున్నది. 'నోట్ల రద్దు వల్ల కలిగే ప్రయోజనాల కోసం 50 రోజులు వేచి చూడండి. ఆ తర్వాత ఉరి తీసినా నేను సిద్ధం' అని మోదీ ప్రకటించారు. కానీ, నోట్ల రద్దుతో ఏం సాధించారనేది పదేండ్ల పాలన ముగుస్తున్న సమయానికి కూడా ప్రభుత్వం చెప్పడం లేదు. నీళ్లలో తోసేస్తే ప్రాణాలు రక్షించుకోవడానికి ఈత వస్తుంది.. అన్నట్టు నోట్ల రద్దు తర్వాత సామాన్య ప్రజలు సైతం డిజిటల్ పేమెంట్ చేయగలుగుతున్నారు. ఇది తప్ప నోట్ల రద్దు ద్వారా మోదీ సర్కార్ సాధించిందేమీ లేదు. నోట్ల రద్దు వల్ల ఎంతో మంది చనిపోయారు. దేశాభివృద్ధి కుంటుపడింది. అయినప్పటికీ బీజేపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందనే బలమైన భావనను మోదీ ప్రజల్లోకి చొప్పిస్తున్నారు.

చివరికి బీజేపీ సైతం తమ ప్రచారంలో పదేండ్ల పాలనలో తాము ఏం అభివృద్ధి చేశామో చెప్పడం లేదు. దానికి బదులు హిందుత్వ, రామ మందిరం, జాతీయ వాదం, మెజారిటీ వర్గాన్నే నమ్ముకున్నది. ఈ అంశాల్లో బీజేపీతో పోటీ పడే పార్టీ లేనే లేదు. ఇండియా కూటమి ఏర్పడిన కొత్తలో బీజేపీకి గట్టి పోటీ ఇస్తుందేమో అని ఆశలు చిగురించాయి. కానీ, రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ఆశలు కూడా ఆవిరైపోయాయి. ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందంటే.. ఇండియా కూటమి అనేది ఒకటుందనే విషయాన్ని కూడా ప్రజలు మరిచిపోయే దుస్థితి ఏర్పడింది. తొలుత ఇండియా కూటమిలో చేరిన ప్రధాన పార్టీలు ఒకదాని తర్వాత ఒకటి బయటకు వచ్చాయి. ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో, హర్యానాలో బలంగా ఉన్న ఆప్ సైతం కాంగ్రెస్‌తో అంటీముట్టనట్టే వ్యవహరిస్తున్నది. కాంగ్రెస్‌తో పొత్తు లేకుండానే పంజాబ్, హర్యానాలో ఒంటరిగా పోటీ చేయనున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. బెంగాల్‌లో బలంగా ఉన్న టీఎంసీ.. ఇండియా కూటమితో సంబంధం లేకుండా సొంతంగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నది. బీహార్‌లో అధికారంలో ఉన్న నితీష్ కుమార్ ఇండియా కూటమి నుంచి బయటకు వచ్చి ఎన్డీయేలో చేరిపోయారు. ఈ పరిణామాలతో ఇండియా కూటమి డీలా పడిపోగా.. ఎన్డీయే అంతకంతకు బలాన్ని పెంచుకుంటూ, విశ్వాసాన్ని కూడగట్టుకుంటున్నది.

ఇలాంటి పరిస్థితుల్లో రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ మూడోసారి పార్లమెంట్ ఎన్నికలను ఎదుర్కొంటున్నది. ఇప్పటికే 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో చావుదెబ్బతిన్న కాంగ్రెస్.. 2024 ఎన్నికల్లోనూ చతికిలపడితే రాహుల్‌గాంధీ నాయకత్వానికి పెద్దదెబ్బే అవుతుంది. అదే కనుక జరిగితే సొంత పార్టీ నుంచే ఆయన నాయకత్వం పట్ల ధిక్కార స్వరాలు వినిపించే అవకాశాలున్నాయి. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందా? లేదా అనేది దేవుడెరుగు. కనీసం గౌరవప్రదమైన సీట్లు సాధిస్తుందనే విశ్వాసం కూడా కలగడం లేదు. 2019లో కాంగ్రెస్ 44 సీట్లు, 20 శాతం ఓట్లు సాధించింది. కనీసం ఈ స్థాయి ఓట్లు, సీట్లు ఈ సారి సాధించగలదా? అనేది కూడా సందేహమే.



> సాధారణంగా రెండు పార్టీల విధానం ఉన్నప్పుడు అధికారంలో ఉన్న పక్షంపై వ్యతిరేకత ఏర్పడితే.. ఆ ఓట్లు మరో పార్టీకి పడతాయి. అయితే మన దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు ఉండటంతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు ఏదో ఒక పార్టీకి కాకుండా, అనేక పార్టీల మధ్య చీలుతున్నాయి. ఈ చీలిక అధికార పక్షమైన బీజేపీకి ఉపయోగపడుతున్నది.

రాహుల్‌గాంధీ నాయకత్వంలో వరుసగా మూడోసారి కాంగ్రెస్ ఓడిపోతే రాహుల్‌గాంధీ పార్టీకి రాజీనామా చేయడమే సబబు అని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సూచించారు. కాంగ్రెస్‌కు పరోక్షంగా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న రాహుల్ గాంధీ పని తీరు ఎలా ఉందనేది కాదు, మూడోసారి కూడా ఓడిపోతే ఆ బాధ్యతల నుంచి తప్పుకోవాలనేది ప్రశాంత్ కిషోర్ అభిప్రాయం. మండల్ ఉద్యమం నుంచి క్రమంగా బీజేపీ ఎదుగుతుంటే అంత కన్నా వేగంగా కాంగ్రెస్ పతనం మొదలైంది. మండల్ కమిషన్‌ను వీపీ సింగ్ తెరపైకి తీసుకువస్తే తమకు మరో గత్యంతరం లేదని ఎల్‌కే అద్వానీ రథయాత్రకు శ్రీకారం చుట్టారు. అదే సమయంలో వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలపడ్డాయి. ప్రాంతీయ పార్టీల విజృంభణ కాంగ్రెస్‌ను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. బీజేపీ రథయాత్ర, మండల్ ఈ రెండూ కాంగ్రెస్‌ను క్రమంగా నిర్వీర్యం చేశాయి.

కాంగ్రెస్‌ను ఆప్ అనేక రాష్ట్రాల్లో చావుదెబ్బ కొట్టింది. బెంగాల్‌లో అధికారంలో ఉన్న టీఎంసీ నాయకురాలు మమతా బెనర్జీ ఒకప్పుడు కాంగ్రెస్ నాయకురాలే. ఇక కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ ఇమేజ్‌తో పుట్టిన పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ ఏపీలో ప్రస్తుతం అధికారంలో ఉన్నది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఏపీలో జగన్ విజృంభించడంతో ఆ పార్టీ అడ్రస్ లేకుండాపోయింది. ఒడిశా, బీహార్, బెంగాల్, ఏపీ, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌ను చావుదెబ్బ తీశాయి. ప్రాంతీయ పార్టీల కారణంగా ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎక్కడా కాంగ్రెస్‌కు అనుకూలమైన పరిస్థితులు కనిపించడం లేదు.

పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే విషయంలో ఎలాంటి సస్పెన్స్ లేదు. బీజేపీకి ఎన్ని సీట్లు వస్తాయి, గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన 44 సీట్లను ఆ పార్టీ నిలబెట్టుకుంటుందా? లేదా అనేది తేలాల్సి ఉన్నది. ఎన్నికల తర్వాత దేశంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా ఉంటాయి. ఒకవేళ మూడోసారి కూడా కాంగ్రెస్ ఓటమిపాలైతే రాహుల్‌గాంధీ నాయకత్వానికి సవాళ్లు ఎదురవుతాయి. పరోక్షంగా కాంగ్రెస్‌ను నడిపిస్తున్న రాహుల్‌గాంధీని తప్పిస్తారా? అధ్యక్షున్ని మారుస్తారా? ఇప్పటి వరకు నమ్ముకున్న సిద్ధాంతాలు ఉపయోగపడలేదని కాంగ్రెస్ తన విధానాలను మార్చుకుంటుందా? అనే విషయం ఫలితాల తర్వాతనే తేలనున్నది.

# టెట్‌పై తర్జనభర్జన



డాక్టర్ ఎస్.విజయ భాస్కర్
92908 26988

**ఇన్ సర్వీస్** ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్‌ను నిర్వహిస్తారా.. లేదా? అనే అంశంపై విద్యాశాఖ ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలా? వద్దా? అన్న మీమాంసలో పడ్డారు. ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఉపాధ్యాయ సంఘాలు విన్నవించాయి. దీంతో ఎన్‌సీటీఈకి ఈ మేరకు ప్రతిపాదనలు పంపిస్తామని, ప్రత్యేకంగా మార్గదర్శకాలు రూపొందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముంచుకొస్తున్నా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

> ఎస్జీటీలుగా దశాబ్దాలుగా విధులు నిర్వర్తిస్తున్నవారు టెట్ ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన పెట్టడం ఆందోళనకరం. ఉపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరినప్పుడు లేని నిబంధనలు కొత్తగా అమలుచేయడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. ఎంతో మంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను టెట్ పేరిట పరీక్షించడం విస్మయం కలిగిస్తున్నది.

భాషోపాధ్యాయుల ఉన్నతీకరణ కోసం పేపర్- 2 ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన పెట్టడం విచిత్రంగా ఉన్నది. భాషోపాధ్యాయులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఇన్విజిలేటర్ డ్యూటీలు చేస్తున్నారు. స్పాట్ వాల్యుయేషన్ డ్యూటీలు కూడా నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఇతరులతో సమానంగా పదోన్నతులు మాత్రం లభించడం లేదు. భాషోపాధ్యాయులు బోధించిన విద్యార్థులు స్కూల్ అసిస్టెంట్లుగా ఉండటం గమనార్హం. చాలామంది భాషోపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరి భాషోపాధ్యాయులుగానే పదవీ విరమణ చేస్తున్నారు. ఏ ప్రభుత్వ శాఖలోనూ లేని విధానం విద్యాశాఖలో ఉండటం శోచనీయం.

మరో విషయం ఏమంటే.. భాషోపాధ్యాయులకు ఏ మాత్రం సంబంధం లేని సాంఘిక శాస్త్రంలో టెట్ నిర్వహించడం వారి పాలిట శాపంగా మారుతున్నది. జీవశాస్త్రం ఉపాధ్యాయులు భౌతికశాస్త్రం లేదా గణితంలో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన సబబు కాదు. ఏపీలో భాషోపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా పేపర్- 3 నిర్వహిస్తున్నారు. కానీ, తెలంగాణలో మాత్రం ఆ విధానం లేదు. ఏపీలో మాదిరిగా భాషోపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా పేపర్- 3 నిర్వహించాలని ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా అధికారులు పట్టించుకోవడం లేదు. పదో తరగతి పరీక్షల పేపర్ వాల్యుయేషన్, ఎన్నికల విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు టెట్‌కు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోలేదు. గడువు ముగియకముందే ప్రత్యేక టెట్ కోసం ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.

## కరువు కరాళ నృత్యం

**రాష్ట్రంలో** కరువు కరాళ నృత్యం చేస్తున్నది. పంటలు ఎండిపోవడంతో అప్పుల పాలై కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో పెద్దఎత్తున రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిని గమనిస్తే ఉమ్మడి ఏపీని తలపిస్తున్నది. రాష్ట్రంలో మళ్లీ వలసలు మొదలయ్యే అవకాశాలు మెండుగా కనపడుతున్నాయి. ప్రభుత్వం ఎంత త్వరగా మేలుకుంటే రాష్ట్రానికి, రైతాంగానికి అంత మంచిది. పంట నష్టపోయిన రైతులను, ఆత్మహత్య చేసుకున్న కర్షకుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- యార కొమురయ్య



## బీజేపీలో చేరితే ఒక్కరోజులోనే విడుదల

*ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఎప్పటికీ తలవంచరు. ఆయన జైల్లో ఉన్నా, బయట ఉన్నా సామాన్యుల హక్కుల కోసం పోరాడుతూనే ఉంటారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ లాగా కేజ్రీవాల్ కూడా బీజేపీలో చేరితే ఒక్కరోజులోనే జైలు నుంచి విడుదలవుతారు.*

- ఆతిశీ, ఢిల్లీ విద్యాశాఖ మంత్రి